క్లుప్తంగా

బీసీ హాస్టల్ వార్డెన్‌కు ఉద్యోగోన్నతి



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్ వార్డెన్ షేక్ ఆలియా బేగంకు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. 2011లో కూచిపూడి హాస్టల్‌కు డిప్యుటేషన్ పై వచ్చిన ఆమె 2019 జూన్ నుంచి రెగ్యులర్ అధికారిగా నేటి వరకు విధులు నిర్వహించారు. అలాగే ఆమె కొంత కాలం మొవ్వ గ్రామంలో బీసీ బాలికల వసతిగృహం ఇన్‌చార్జిగా అధికారిగా వ్యవహరించారు.

మెగా ఉచిత వైద్యశిబిరం



గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు 200 మందికి పైబడి రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండెకు సంబంధించి ఈసీజీ, 2డి–ఎకో, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ, క్లబ్ కార్యదర్శి కె.రామారావు, కోశాధికారి కె.రామకృష్ణ, డాక్టర్లు రక్షిత, శ్రీకాంత్, సుజాత, అజయ్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన సదస్సు

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలిలో హెచ్ఐవీ నివారణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో సదస్సు, ర్యాలీ జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న లింక్ వర్కర్ సీహెచ్ నాగలక్ష్మి మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వారిని చులకనగా చూడకూడదన్నారు. వీరి జీవన ప్రమాణాన్ని పెంచేందుకు తమ సంస్థతోపాటు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు శ్రీకారం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వేదికపైకి చేర్చి అలంకరించి వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. గణపతి పూజ, రక్షాబంధన, అఖండస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. సహాయ కమిషనర్ నేల సంధ్య పూజలు చేశారు.

విద్యార్థుల భోజనంలో తేడా వస్తే జైలే

–సీనియర్ సివిల్ జడ్జి బాబూనాయక్



మోపిదేవి: పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో ఏదైనా తేడా జరిగితే బాధితులకు జైలు శిక్ష ఉంటుందని అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాబూనాయక్ హెచ్చరించారు. మోపిదేవి గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఇబ్బందులు, వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయిలో చదువుకు మంచి ఫౌండేషన్ వేయాలని అప్పుడే ఉద్యోగాలు కూడా మంచివి మన దగ్గరకు వస్తాయని తెలిపారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నందున విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాలని, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బయట ఆహార పదార్థాలను లోనికి రానివ్వకూడదని, రాత్రిపూట ఉండే వాచ్‌మెన్ మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. డ్రింకింగ్ వాటర్ ఆర్వోప్లాంట్ వద్ద పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మరోసారి ఆకస్మికంగా వసతిగృహాన్ని తనిఖీ చేస్తామని ఏమైనా సమస్యలు మా దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు పాఠశాల తరగతి గదులు, లైబ్రరీ, స్టాఫ్‌రూం, బాత్‌రూములు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఏజీపీ ఈశ్వరావు, ఏపీపీ సీహెచ్‌వీకే ప్రసాద్ పాల్గొన్నారు.

నూకాలమ్మ ఘటం ఊరేగింపు

రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెంలోని గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారి ఘటం బిందె ఊరేగింపు శనివారంతో ముగిసింది. ఐదు రోజులుగా మోపిదేవి, రావివారిపాలెం పురవీధుల్లో పోతురాజు కర్ర డప్పుకళాకారుల సందడితో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుంటారని ఆలయ కమిటీ తెలిపింది.

రక్షణ లేని ఉద్యోగాలు చేయలేం



కోల్‌కతాలో లేడీ డాక్టర్‌పై జరిగిన ఘటన దారుణం. ప్రజలకు సేవలందించే లేడీ డాక్టర్ల పై ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలి. తాగిన మైకంలో హాస్పిటల్‌కు వచ్చిన వారితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నైట్ డ్యూటీ నర్సులు, డాక్టర్లకు రక్షణ లేనిదే ఉద్యోగాలు చేయలేం. ప్రభుత్వాలు లేడీ డాక్టర్లు, నర్సులకు రక్షణ కల్పించాలి.

– డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి, మొవ్వ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్షణ కల్పించాలి



కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన అత్యంత హేయనీయం. మంచి, చెడును చిన్నప్పటి నుంచి అమ్మాయిలకే కాదు అబ్బాయిలకు కూడా నేర్పించాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతతో పాటు సౌకర్యాలు కల్పించాలి. ఈ విధంగా చేసినప్పుడే డ్యూటీలు సక్రమంగా చేయగలం.

– రొంపిచర్ల భార్గవి, గైనకాలజిస్టు, పామర్రు

కోరలు చాస్తున్న కలుషిత తాగునీటి సమస్య

నందివాడ మండలంలో కలుషిత తాగునీటి సమస్య గ్రామాల్లో కోరలు చాస్తోంది. తాగునీటి చెరువులు కలుషిత కాసారాలుగా మారాయి. తాగునీరు రంగుమారి దుర్వాసన వస్తోంది. దీంతో తాగడానికి మాట దేవుడెరుగు కనీసం వాడుకునేందుకు పనికి రాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఉన్నా అవి సక్రమంగా పని చేయడం లేదు. దీంతో ప్రజలు నీటిని పాలు మాదిరిగా కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.





కలుషితమైన ఒద్దులమెరక గ్రామ తాగునీటి చెరువు (ఇన్‌సెట్లో) ఎల్ఎన్‌పురంలో నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్

పని చేయని రక్షిత మంచినీటి పథకాలు

గుడివాడరూరల్: కలుషితమైన తాగునీటితో నందివాడ మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో మరో 20 శివారు గ్రామాలున్నాయి. రెండు దశాబ్దాల కాలంలో ఈ ప్రాంతంలో ఆక్వా పరిశ్రమ అభివృద్ధి చెందడంతో 40 వేల ఎకరాల పంట పొలాలు చేపల చెరువులుగా మారాయి. చెరువుల్లో చేపలతో పాటు రొయ్యల సాగు చేస్తున్నారు. రానురాను పంట కాలువలు, చానల్స్ కలుషితంగా మారడంతో గ్రామాల్లో కలుషిత మంచినీటి సమస్య తీవ్రమైంది.

కలుషితమైన మంచినీటి చెరువులు

చేపల, రొయ్యల చెరువుల సాగు వలన పట్టుబడి సమయంలో కలుషితమైన చేపల, రొయ్యల చెరువుల్లో నీటిని తాగునీటి చెరువులకు నీటిని అందించే పంట కాలువల్లో వదిలేస్తున్నారు. ఆ నీటినే మంచినీటి చెరువులకు పెడుతున్నారు. ఫలితంగా కలుషిత నీరు చెరువుల్లో చేరి రోజులు గడిచే కొద్ది మంచినీటి చెరువులు ఉప్పునీటి చెరువులుగా మారిపోతున్నాయి. ఆ నీటిని తాగలేని దుస్థితి ఏర్పడింది. పోలుకొండ, ఎల్ఎన్ పురం, ఇలపర్రు, శంకరపాడు, గండేపూడి, పొనుకుమాడు గ్రామాలకు కాలువల నుంచి తాగునీటిని పెట్టే అవకాశం లేకపోవడంతో విజయవాడ, గుడివాడ ప్రాంతాల నుంచి మురుగును తెచ్చే బుడమేరు, చంద్రయ్య డ్రెయిన్లలోని నీటిని పెడుతున్నారు. దీని వలన నీరు మరింత కలుషితమై ఆయా గ్రామాల ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కలుషితమైన నీటిని తాగలేక ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. నందివాడ మండలంలో రక్షిత మంచినీటిని అందించేందుకు మంచినీటి పథకాలున్నాయి. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మండలానికి చెందిన పిన్నమనేని వెంకటేశ్వరరావు గ్రామీణ మంచినీటి సరఫరా మంత్రిగా పని చేయడంతో ప్రతి గ్రామంలోనూ ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణం, మైనర్ గ్రామాల్లో మైక్రో వాటర్ సిస్టం, మినీ రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేశారు. దీని వలన గ్రామస్తులు మంచినీటి చెరువుల నుంచి వచ్చే నీటిని క్లోరినేషన్ అయిఉండడంతో వాటినే తాగేవారు. ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది. ఏ గ్రామంలో చూసినా పని చేయని ఫిల్టర్‌బెడ్‌లు, నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌లు దర్శనమిస్తున్నాయి. పంచాయతీవారు నీటిని ఫిల్టర్ చేయకుండా కలుషిత నీటినే ప్రజలకు నేరుగా అందించడంతో ప్రజలను ఆ నీటిని తాగలేక అంటు వ్యాధుల బారిన పడుతున్నారు. రుద్రపాక, పుట్టగుంట, ఒద్దులమెరక, పెదలింగాల, జనార్దనపురం, ఎల్ఎన్‌పురం గ్రామాల్లో పరిస్థితి జఠిలంగా మారింది. ఆయా గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారుల్లో మాత్రం చలనం కన్పించడం లేదని ఆరోపణలున్నాయి.

పాలు మాదిరిగానే నీరు కొనుగోలు

కలుషిత మంచినీటి సమస్య పుణ్యమా అని ప్రతి గ్రామంలో ప్రతిరోజూ పాలు కొనుగోలు చేసే మాదిరిగా నీటిని ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. కలుషితమైన నీటిని తాగితే అంటు వ్యాధుల బారిన పడతామని భయపడిన ప్రజలు నీటిని కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. దీన్నే ఆసరాగా తీసుకుని గ్రామాల్లో ఎక్కడబడితే అక్కడ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి అడ్డగోలుగా నీటిని అమ్మేస్తున్నారు. 20 లీటర్ల ఒక్కో క్యాన్ రూ.25 నుంచి రూ.30కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లోని చిన్నచిన్న దుకాణాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చి నీటిని అమ్మేస్తుండటంతో ఆ నీటినే తాగిన ప్రజలు మోకాళ్ల నొప్పులు, జీర్ణకోశ, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రస్తుత పాలకులు మండలంలో నెలకొని ఉన్న కలుషిత మంచినీటి సమస్యపై దృష్టిసారించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగునీటి డ్రెయిన్ నీరే గతి



దశాబ్దాలకాలంగా దోసపాడు చానల్ నుంచి మా చెరువుకు నీరు రావడం లేదు. తాగునీటి కోసం బుడమేరు ఎగువ నుంచి వచ్చే మురుగునీటిని మంచినీటి చెరువుకు పెడుతున్నారు. మురుగునీరు కావడం వలన పూర్తిగా కలుషితమై తాగడానికి వీల్లేని విధంగా మారుతున్నాయి. నీటిని కొనుగోలు చేయలేని పేదలు ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారు.

– బి.అయ్యప్పరాజు, ఎల్ఎన్‌పురం

నీటిని కొనుగోలు చేయలేకపోతున్నాం



రెక్కాడితే గాని డొక్కాడదు. ఏ రోజు కూలి ఆ రోజు వస్తే పూట గడుస్తుంది. తినడానికే నానా తంటాలు పడుతున్నాం. చెరువులో నీరు కలుషితమవ్వడం వలన ఆ నీరు తాగలేకపోతున్నాం. నీటి కోసం ప్రతి రోజూ మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పుట్టగుంట గ్రామానికి వెళ్లి నీటిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నా. సమస్యను పరిష్కరించి అధికారులు, పాలకులు పుణ్యం కట్టుకోవాలి.

– పి.మురళీమోహన్, ఒద్దులమెరక

ర్యాగింగ్ బూతం నుంచి బయటపడాలి

గుడివాడ టౌన్: ర్యాగింగ్ బూతం నుంచి విద్యార్థులు బయటపడాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి అన్నారు. స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్–మత్తు పదార్థాల వాడకం అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ర్యాగింగ్ మితిమీరినప్పుడే ప్రాణం మీదకు వస్తుందన్నారు. తొలి రోజుల్లోనే ఆ అంశానికి మంగళం పాడాలన్నారు. మత్తు పదార్థాల విషయానికి వస్తే అవి జీవితాన్నే సర్వనాశనం చేస్తాయన్నారు. ఈ వయస్సులో అమాయకంగా మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవడం జరుగుతుందన్నారు. కొద్ది కాలం వాటిని దూరంగా ఉంచితే వాటి జోలికి వెళ్లరని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. గౌరిమణి, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అజయ్‌బాబు, కార్యదర్శి నటరాజ్, ప్యానల్ సభ్యులు, వన్‌టౌన్, టూటౌన్ ఎస్సైలు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

అద్దెకు సీడబ్ల్యూసీ గోడౌన్లు సిద్ధం

కైకలూరు: సెంట్రల్ వేర్‌హౌస్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) ఆటపాక గోడౌన్లు అద్దె ప్రాతిపదికన అందిస్తామని మేనేజర్ చిరంజీవి నాయుడు శనివారం తెలిపారు. వ్యవసాయ, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్(ఎఫ్ఎంసీజీ) ఉత్పత్తులను శాస్త్రీయ పద్ధతుల్లో గోడౌన్లలో తక్కువ అద్దెకు నిల్వ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పురుగుల నియంత్రణ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేటు సంస్థలు దీర్ఘ కాలికంగా గోడౌన్లను వినియోగిస్తే అద్దె తగ్గింపు సైతం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94933 42652 సెల్ నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

దోసపాడు చానల్లో పూడిక తీయాలి

– సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి



ఇంజిన్లతో నీటిని తోడుతున్న పంట పొలాలను పరిశీలిస్తున్న ఆర్సీపీ రెడ్డి

గుడివాడరూరల్: దోసాపాడు చానల్లో పూడికను అధికారులు వెంటనే తొలగించాలని సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి అన్నారు. నందివాడ మండలంలోని జనార్దనపురం గ్రామంలోని పంట భూములను శనివారం ఆయన రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును ఆర్సీపీ రెడ్డి వద్ద వెళ్లబోసుకున్నారు. దోసపాడు చానల్ నుంచి లంక కాలువ ద్వారా సుమారు 200ఎకరాల పంట పొలాలకు సాగు నీరు అందాల్సి ఉందని రైతులు తెలిపారు. నీరు రాకపోవడంతో రైతులు ఎకరానికి ఒక్కొక్కరు రూ.1000 చొప్పున చందాలు వేసుకుని కాలువను తవ్వినా ప్రయోజనం లేదని తెలిపారు. దీనికి కారణం ఎగువన కాలువ పూడిక తీయకపోవడమేనని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్సీపీ రెడ్డి మాట్లాడుతూ జనార్దనపురం శివారు రైతులు దోసపాడు చానల్ నుంచి నీరు అందకపోవడంతో ఇంజిన్ల ద్వారా నాట్లు వేశారన్నారు. ఇప్పటికీ నీరు అందకపోవడంతో కలుపులకు, మందులు పిచికారీ చేయడానికి ఇంజిన్లను ఉపయోగించాల్సి వస్తుందన్నారు. దీనికి కారణం ఎగువన పెదపారుపూడి మండలం దూళ్లవానిగూడెం గ్రామం దగ్గర కాలువ పూడుకుపోయి నీరు దిగువకు సక్రమంగా రాకపోవడమే కారణమన్నారు. వరిపంటకు పొట్ట దశలో సాగునీరు అందకపోతే పంట దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి సమస్య గురించి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు రైతులు తెలియపర్చారన్నారు. ఎమ్మెల్యే ఈ విషయంపై శ్రద్ధచూపి పూడిక తీసే విధంగా ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆర్సీపీ రెడ్డి కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకుడు నీలం మురళీకృష్ణారెడ్డి, సీహెచ్ రాజేష్ పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయాలి

మండవల్లి: గ్రామ సభలను విజయవంతం చేయాలని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయం వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో జరిగే గ్రామ సభలు పూర్తి స్థాయిలో విజయవతం అయ్యే విధంగా చూడాలన్నారు. ప్రస్తుతం జరిగిన గ్రామ సభల్లో అధిక శాతం ప్రజల భాగస్వామ్యం లేకుండా తూతూమంత్రంగా నిర్వహించారని ప్రజలు ఆరోపిస్తున్నారన్నారు. అధికారులు హాజరుకాకపోవడం, తీర్మానించిన పనులు చేయకపోవడంతో సభల వైపు ప్రజలు కన్నెత్తి చూడటం లేదని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామ సభలను విజయవంతం చేసి గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగస్వాములు కావాలని కోరారు.

విద్యార్థులకు క్షేత్రస్థాయి జ్ఞానం అవసరం

గుడివాడ టౌన్: వివిధ పరిశ్రమలు సందర్శించడం వలన క్షేత్రస్థాయి పరిజ్ఞానం పెంపొందుతుందని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ అన్నారు. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో తమిరిశ గ్రామంలోని ఉమా స్పిన్‌టెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను శనివారంసందర్శించారు. ఈ సందర్భంగా ఎంబీఏ విద్యార్థులు పరిశ్రమల నిర్వహణ, వాటిలోని సాంకేతిక అంశాలు, వ్యాపార పరిమ, కార్మికుల పర్యవేక్షణ తదితర అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకుని వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటారన్నారు. వస్తువుల తయారీ, ప్యాకింగ్, సరఫరా, అమ్మకాలు విషయంలో కూడా అవగాహన వస్తుందన్నారు. ఉమా స్పిన్‌టెక్స్ డైరెక్టర్ నందమూరి కృష్ణ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి ఎం.బి.సువర్చల, అధ్యాపకులు నాగేంద్రకుమార్, భరత్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



ముదినేపల్లి రూరల్: స్థానిక ఇండోసాక్సన్ పాఠశాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో కృష్ణుడు, రాధా వేషధారణలతో అలరించారు. అనంతరం ఆనందోహోత్సాహాల మధ్య ఉట్టి కొట్టారు. ఈ వేషధారణాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కృష్ణాష్టమికి విష్ణాలయం ముస్తాబు

పామర్రు: కృష్ణాష్టమికి స్థానిక విష్ణాలయం ముస్తాబవుతోంది. ఈ నెల 26వ తేదీన కృష్ణాష్టమిని పురస్కరించుకుని రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం ఉదయం స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి శనివారం పేర్కొన్నారు. అదే రోజు సాయింత్రం ఆరు గంటల నుంచి ఆలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి సన్నిధిలో ఉట్టిని కొట్టి బహుమతిని పొందవచ్చని పేర్కొన్నారు.

అన్న క్యాంటిన్లే ముద్దు

మధ్యాహ్నం 12 గంటలైనా పాఠశాలలకు అందని భోజనం



గుడివాడలో ఖాళీప్లేట్లతో నిరీక్షిస్తున్న చిన్నారులు

గుడివాడ టౌన్: కూటమి ప్రభుత్వంలో పేదవానికి విద్య మిధ్యగానే మిగిలిపోతుందనే అభిప్రాయం ప్రజలనుంచి వ్యక్తమవుతోంది. పాలనలో పాఠశాలల అభివృద్ధి గాని, విద్యార్థుల సంక్షేమం, ఉత్తమ విద్యపై దృష్టి సారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అమ్మఒడి పథకం పేరుమార్చి తల్లికి వందనం అంటూ ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన ఈ ప్రభుత్వం దాని ఊసే ఎత్తక పోవడంతో విద్యార్థుల తల్లులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇది ఇలా ఉండగా పాఠశాలలకు భోజనం అందించే విషయంలో సైతం వివక్ష చూపుతున్నట్లు కొందరు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రత్యేకించి అన్న క్యాంటిన్లు ప్రారంభమయ్యాక మధ్యాహ్న భోజనం పథకం అమలులో సమయపాలన లోపించిందని ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ఉదయం 11.45 గంటలకు చిన్నారులకు మిడ్డే మీల్స్ వడ్డించాల్సి ఉంది. అయితే 12 గంటలకు కూడా పాఠశాలలకు భోజనం చేరడంలేదు. గుడివారూరల్ మండలం బొమ్ములూరు వద్ద మధ్యాహ్న భోజనం సరఫరా కోసం ఏర్పాటు చేసిన వంటశాల నుంచి అన్న క్యాంటిన్లకు కూడా భోజనం సరఫరా చేస్తున్న నేపథ్యంలో ఇది ఆలస్యం అవుతోంది. చిన్నారులు ఆకలితో ఉంటారు కనుక తొలుత వీరికి భోజనం అందించి తదుపరి అన్న క్యాంటిన్లకు సరఫరా చేయాలని కోరినప్పటికీ అన్న క్యాంటిన్లే ప్రధానమంటున్నారని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలకు ముందుగా భోజనం సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న పార్వతి

గుడివాడ టౌన్: ఎయిడ్స్ వ్యాధిని నియంత్రించడం సులువని అంకిత స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ ఔట్‌రీచ్ వర్కర్ కె.పార్వతి అన్నారు. స్థానిక రిషి ఒకేషనల్ కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్‌వ్యాప్తి, నియంత్రణ, జాగ్రత్తలు అంశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ భయంకరమైన వ్యాధి అని అవగాహన ఉంటే దానిని నియంత్రించడం సులువని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌బాబు, ఏఎన్ఎంలు, అంకిత సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

గుడివాడ టౌన్: బీజేపీని బలోపేతం చేసేందుకు నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి యు. శ్రీనివాసరాజు అన్నారు. స్థానిక పాటిమీద గల బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వాలు పెంచేందుకు నాయకులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సభ్యత్వ నమోదులో జిల్లా రాష్ట్రంలో నాల్గో స్థానంలో ఉందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్. బుచ్చిరాజు, బీజేపీ జిల్లా, నియోజకవర్గ స్థాయి, పార్లమెంట్ స్థాయి కన్వీనర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కైకలూరు టౌన్ సీఐ కృష్ణ

కైకలూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని కైకలూరు పట్టణ సీఐ పి.కృష్ణ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌పై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఫోను, కంప్యూటర్ ఆధారంగా నెట్‌వర్క్‌ను ఉపయోగించి చేసే మోసాలను సైబర్ మోసాలంటారని తెలిపారు. వీటిలో ప్రధానంగా ఓటీపీ(ఒన్ టైమ్ పాస్‌వర్డ్), ఆధార్ అప్‌డేట్, పాన్ కార్డ్, క్రెడిట్, డెబిట్ కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఈ–కేవైసీలో మోసాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల లోన్ యాప్‌ల పేరుతో నగదు అందించి తర్వాత వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు మీరు లక్కీడిప్ ద్వారా నగదు గెలిపొందారు ఓటీపీ చెప్పండి అని అడిగితే నమ్మవద్దన్నారు. అదే విధంగా 4జీ సిమ్ నుంచి 5జీ సిమ్‌కు అప్‌డేట్ చేయాలంటే ఈ క్రింది లింక్‌ను క్లిక్ చేయండని వచ్చే మెసేజీలను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ క్రైం మోసాలు జరిగినప్పుడు 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోలీసుశాఖ గ్రామాల్లో సైబర్ నేరాల నివారణ, దొంగతనాల జరగకుండా జాగ్రత్తలపై కరపత్రాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మీకోసం ఫిర్యాదుపై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పరిశీలన

కైకలూరు: మీకోసం కార్యక్రమంలో ఈ నెల 19న కైకలూరు మండలం ఆలపాడు గ్రామానికి చెందిన బండి శ్రీనివాసరావు బీసీ కాలనీలో రహదారులు, విద్యుత్ స్తంభాలు, పంచాయతీ కుళాయిలు, కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేయాలని ఫిర్యాదు చేశాడు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ త్రినాథబాబు, కైకలూరు డీఈ శాస్త్రి, ఏఈ నాగబాబు, పంచాయతీ సెక్రటరీ శివన్నారాయణ శనివారం పరిశీలించారు. పంచాయతీ ద్వారా బీసీ కాలనీలో కుళాయిలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

కోడూరు: ఎరువులు, పురుగు మందుల షాపుల్లో వ్యవసాయ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కోడూరు వంతెన సెంటర్ నుంచి తూర్పు వైపు వరకు ఉన్న షాపుల్లో తనిఖీలు జరిగాయి. పురుగు మందులు, ఎరువుల విక్రయాల రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అధిక రేట్లకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ శ్రీధర్ హెచ్చరించారు. యూరియా, డీఏపీ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

బందుమూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచి గుడివాడ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం యావన్మందికీ తెలుపునది ఏమనగా.. ఈ క్రింది షెడ్యూలులో చూపిన తమ్మిరెడ్డి రంగారావు గారి భార్య తమ్మిరెడ్డి విజయలక్ష్మి గారి స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేసుకుని తమ్మిరెడ్డి విజయలక్ష్మి గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నాము. కావున సదరు వ్యవహారానికి సంబంధించి ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరాలు గానీ, అప్పులు, ఛార్జీలు, క్లెయిమ్‌లు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదాలు ఉన్న యెడల నేటి నుండి 7 రోజులలోపు ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూల్ : ఏలూరు జిల్లా, కైకలూరు సబ్ రిజిస్ట్రారు వారి ఖులాశా, కైకలూరు పంచాయితీ ఏరియాలో చేరిన కైకలూరు గ్రామ ఆర్. సర్వే నెం. 317/2లో ద.గ. 178లు దాఖలా ద.వే. నెం. 5384/2024కు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు. తూర్పు : పి. మారయ్య గారి ఆస్తి, దక్షిణం : ఎం. సుబ్బరాజు గారి ఆస్తి, పడమర: ఆర్. సూర్యనారాయణ గారి ఆస్తి, ఉత్తరం: టి. విజయలక్ష్మి గారి ఆస్తి మరియు పి. మారయ్య గారి ఆస్తి.

వంగ్రాజు రాంబాబు, న్యాయవాది, మెయిన్‌రోడ్, ఉయ్యూరు.

